నమస్తే తెలంగాణ
నిజామాబాద్
13 | నిజామాబాద్, ఆదివారం 26 జనవరి 2025 | NIZAMABAD



ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి వేముల, కమిటీ సభ్యులు రామన్న, సత్యవతిరాథోడ్, అజయ్, బాజిరెడ్డి, రసమయి, అంజయ్య, కోటిరెడ్డి, యాదవ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

రేవంత్ పాలనలో రోజుకో రైతు ఆత్మహత్య

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి సమస్యను విన్నవిస్తున్న రైతు

కోతల ప్రభుత్వం

- జిల్లాలో 49శాతం మందికే రుణమాఫీ
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్/బాల్కొండ/భీమ్‌గల్/వేల్పూర్/మెండోరా/ముప్కాల్, జనవరి 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేతలు, కోతల ప్రభుత్వంగా మారిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయానికి రైతుబంధు రంచన్‌గా పడేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నాట్లు వేసేటప్పుడు కాకుండా ఓట్లు ఎప్పుడెప్పుడు ఉన్నాయో అప్పుడే రైతుబంధు వేస్తున్నరని, ఓట్లు లేకపోతే రైతుబంధు ఎగ్గొడుతున్నరని మండిపడారు. వానాకాలంలో ఓట్లు లేవు అందుకే రైతుబంధు ఎగ్గొట్టిండ్రు. మళ్లీ పంచాయతీ ఎన్నికలు వస్తున్నయి, ఇప్పుడు రైతుబంధు వేస్తమని అంటున్నరు. రుణమాఫీ విషయంలోనూ అన్ని కోతలు పెట్టి అర కొర మందికే రుణమాఫీ చేసిండ్రు. జిల్లాలో కుటుంబానికి ఒక్కో రైతును తీసుకుంటేనే 2.03 లక్షల మంది ఉన్నారు. అందులో కేవలం 1.01 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసిండ్రు. ఇంకా 1.02 లక్షల మందికి రుణమాఫీ కావాలి. 49శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. బాల్కొండ నియోజకవర్గంలో 51వేల మంది రుణాలు తీసుకుంటే, 20వేల మందికి మాత్రమే రుణమాఫీ అయింది. ఇంకా 31 వేల మందికి కావాల్సి ఉంది. అప్పుడేమో రుణాలు తెచ్చుకొండ్రి. నేను రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిండు. మాఫీ చేసే ఉద్దేశం లేదు కాబట్టే ఇప్పుడు కోతలు పెట్టిండ్రని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో 24గంటల కరెంటు వస్తే, ఇవ్వాల రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నది. పదేండ్ల పాటు మోటర్లు కాలిపోవుడే మరిసిపోయినం, కానీ ఇప్పుడు మళ్లీ మోటర్లు కాలిపోవడం మొదలయ్యిందనారు. పదేండ్లు గంజిలకు పోలే, అడ్డి దుకాండ్ల బాకీలు తెచ్చుకోలే ఎందుకంటే కేసీఆర్ రంచనుగా రైతుబంధు ఇస్తుండే. పంటను కొంటుండే. బాకీలు తెచ్చుకునే అవసరం లేకుండే. కానీ ఇప్పుడు జిల్లా రైతులు అడ్డి దుకాండ్లకు పోయి బాకీలు తెచ్చుకుంటుండ్రు. మళ్లీ పాత రోజులొచ్చినయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నది. ఆశపెట్టి మోసం చేయడంవల్లే రైతులకు ఈపరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పుల బాధలతో అన్నదాతల ఆత్మహత్యలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ నికృష్టమైన విధానాన్ని ఎండగట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులతో మాట్లాడి అన్ని విషయాలను తెలుసుకుని ఈ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలనే ఉద్దేశంతో కేటీఆర్ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసిండని వివరించారు. రైతుల సాధకబాధకాలను తెలుసుకుంటున్న అధ్యయన కమిటీ సభ్యులకు వేముల కృతజ్ఞతలు తెలిపారు. రైతులు 82 వినతిపత్రాల ద్వారా వారి సమస్యలను తెలిపారని, ప్రభుత్వానికి, వ్యవసాయ కమిషన్‌కు తెలియజేయాలని కమిటీని కోరారు. రైతులకు ఇచ్చే రుణంపై వడ్డీ ఎక్కువ వేస్తున్నారన్న విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు.

కాంగ్రెస్, బీజేపీ వేర్వేరు కాదని, రెండూ ఒక్కటేనని బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామని కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రశ్నించదు. రాష్ట్రంలో కాంగ్రెస్ రైతులను మోసగించిన తీరుపై బీజేపీ ప్రశ్నిందని గుర్తు చేశారు. రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రాంతీయ పార్టీల గొంతు నులిమేందుకు యత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. చైర్మన్ నిరంజన్‌రెడ్డి, సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, యాదవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్యయాదవ్‌తో కూడిన అధ్యయన కమిటీ శనివారం మెండోరా మండలం బుస్సాపూర్‌లో రైతులతో ముఖాముఖి సమావేశమైంది. స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. 12 మంది రైతులు తమ సమస్యలు చెప్పుకోగా, 82 మంది వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల తీరును దుయ్యబట్టారు.

–నిజామాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/మోర్తాడ్, బాల్కొండ, ముప్కాల్, భీమ్‌గల్, వేల్పూర్:

రైతులను పట్టించుకోని బీజేపీ,కాంగ్రెస్

- బీజేపీ మేనిఫెస్టో అమలుపై కాంగ్రెస్ నిలదీయదెందుకు?
- కాంగ్రెస్ హామీల ఎగవేతపై కమలం నోరు మెదపదెందుకు..
- బుస్సాపూర్ రైతుల ముఖాముఖిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- జిల్లాలో బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ పర్యటన
- కాంగ్రెస్ తీరుతో అనాథ అనే భావన రైతుల్లో వచ్చిందని వ్యాఖ్య

ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన రైతులు

రాహుల్‌గాంధీ లబోదిబోమనుడు ఖాయం..

చూడకూడని రైతుల ఆత్మహత్యలు, ఆటో డ్రైవర్ల మరణాలు కాంగ్రెస్ పరిపాలనలో చూస్తున్నామని నిరంజన్‌రెడ్డి అన్నారు. వీధుల్లోకి వస్తున్న వివిధ వర్గాల ప్రజలను చూస్తున్నామని తెలిపారు. ఏడాది పాలనలో ఎవ్వరూ సంతోషంగా లేరని, ఆఖరుకు కాంగ్రెస్‌కు ఓటేసిన ఆ పార్టీ కార్యకర్తలు కూడా సంతోషంగా లేరన్నారు. అసలు కాంగ్రెస్ యాడ ఉందో. ఇదీ కిరాయి కాంగ్రెస్ లాగ ఉందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ.. నీ కాంగ్రెస్‌ను నువ్వు రిపేర్ చేసుకోవాల్సిందే. మేలుకోకపోతే లబోలబోమంటూ మొత్తుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మీ అమ్మ, చెల్లి, మీరు తెలంగాణకు వచ్చి అనేక హామీలు ఇచ్చిండ్రు. మళ్లీ వచ్చి పోలీసుల రక్షణ లేకుండా రైతులతో మాట్లాడి తిరిగి వెళ్లండని కాంగ్రెస్ ముఖ్య నేతలకు సవాల్ విసిరారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఉండగా సాగుకు నీళ్లు రాకపోవడంపై నిరంజన్ రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలకులకు పట్టింపు లేదని చెప్పారు. ఆంధ్రోళ్లు గండి పెట్టి కృష్ణా నీళ్లు సరిపోలేదని గోదావరి నీళ్లను పోలవరం నుంచి మొదలుపెట్టి పట్టిసీమ నుంచి ఏలూరు నుంచి ఆంధ్ర ప్రాంతం దాటించి రాయలసీమకు ఎత్తుకపోయేందుకు భారీ కుట్రలకు తెర లేపుతున్నారని నిరంజన్ రెడ్డి వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి సోయి లేదని, లోపాలను ఎత్తి చూపితే బీఆర్ఎస్ పార్టీ నాయకులపై తేలికగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ అంటేనే సాగు నీళ్లు అని చెప్పారు. కృష్ణా, గోదావరి లేకపోతే తెలంగాణకు బతుకు లేద

హామీలు ఎటుపోయాయ్..

రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానని 2014లో మోదీ చెప్పారని, 2025 వచ్చినప్పటికీ ఆ హామీ ఏమైందని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. మోదీ హామీలకు 11 ఏండ్లు దాటి పోయాయని, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ప్పటికీ రైతుల ఆదాయం రెండింతలు కాలేదని దుయ్యబట్టారు. అరవై ఏండ్లు నిండిన సన్న, చిన్నకారు రైతులకు పెన్షన్ ఇస్తామని బీజేపీ చెప్పిందని ఆ హామీ నీరుగారిందన్నారు. రైతులను బీజేపీ మోసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ కనీసం మాట వరుసకైనా నిలదీయడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఇష్టమొచ్చినట్లుగా నోరు పారేసుకున్న వారంతా ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. ఏడాది కాలంగా కాంగ్రెస్ అనేక హామీలు ఎగ్గొట్టినా బీజేపీ వారెవ్వరూ మాట్లాడకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అన్నది తేటతెల్లమైందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని బీజేపీ హామీ ఇచ్చింది. ఎందుకు అమలు చేస్తలేరు. దీనిపై కాంగ్రెస్ మాట్లడుతుందా అంటే మాట్లాడదు. రెండు జాతీయ పార్టీలు ఒక్కటే. ప్రాంతీయ పార్టీల గొంతు నులిమేందుకు ఏకమవుతున్నాయి. మొన్న కరీంనగర్‌లో బండి సంజయ్ అన్నట్లుగానే.. ప్రభుత్వ కార్యక్రమంలో తన కడుపులో ఉన్న ఉబలాటం, సంతోషం పట్టలేక తామంతా (కాంగ్రెస్, బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు) ఒకటే అంటుండు. మేము అదే అంటున్నాం. మీరంతా ఒక్కటే. కొట్లాడుకుంటామని చెప్పి ఏకమవుతుండ్రు. తెలంగాణను ముంచుతుండ్రు అని మండిపడ్డారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీం అంటూ మాపై నిందలు వేశారు. కానీ ఎవర్ని జైల్లో పెట్టారు. కాంగ్రెస్ వారిని పెట్టలేదు కదా. మా బిడ్డనే కదా అన్యాయంగా ఇబ్బందులకు గురి చేశారని ఎమ్మెల్సీ కవిత అరెస్టును పరోక్షంగా ప్రస్తావించారు. మమ్మల్ని అనడానికి సిగ్గుండాలే కదా అని కాంగ్రెస్, బీజేపీలను ఎద్దేవా చేశారు.



411 రోజుల్లో 409 బలవన్మరణాలు

పదేండ్ల కేసీఆర్ పాలన తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 నెలలు తిరుగముందే రైతులు పిట్టల్లా రాలిపోతున్నారని నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 411 రోజుల కాంగ్రెస్ పాలనలో దాదాపు 409 మంది చనిపోయారని వివరించారు. సరాసరిగా రోజుకొక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని తెలిపారు. రైతుల మరణాలను బహుమానాలుగా కాంగ్రెస్ సర్కారు అందిస్తున్నదని ధ్వజమెత్తారు. రైతులను ఆత్మహత్యల వైపు పురిగొల్పేలా ఈ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. కేసీఆర్ పాలనలో రైతుబంధు, ఉచిత కరెంట్, సాగుకు నీళ్లు, రైతుబీమా ఇలా అనేక పథకాలు ఉన్నప్పటికీ, పరోక్షంగా రైతుకు జరిగిన పెద్ద మేలు పంటల కొనుగోళ్లు అని వివరించారు. తెలంగాణ రాక మునుపు మార్కెట్‌కు పోతే తడిసిందనో, రంగు మారిందనో తక్కువ ధరకు వ్యాపారులు కొనేటోళ్లు. యాభై క్వింటాళ్లు అమ్ముకునే రైతుకు రెండున్నర క్వింటాళ్ల నష్టం వాటిల్లేది. కానీ, కేసీఆర్ హయాంలో పంటల కొనుగోళ్ల ద్వారా రైతులు నష్టపోకుండా ప్రతి రైతుకూ మిగులు బాటు అయ్యిందని గుర్తు చేశారు. ఇప్పుడేమో ఏడాది కాలంగా పరిస్థితి అధ్వానమైందన్నారు. బోనస్ అని చెప్పి కొంత మంది రైతులకే అందించారని దుయ్యబట్టారు. సన్న వడ్లు అని చెప్పి నూట్లో ఐదుగురికే ఇచ్చారని మండిపడ్డారు. సన్న వడ్లకు తప్ప పత్తి, మక్క పంటలకు బోనస్ లేదు. కాంగ్రెస్ పాలనలో పత్తికి మద్దతు ధర అందడం లేదని మండిపడ్డారు.



నేతల ప్రసంగాలను శ్రద్ధగా వింటున్న రైతు

చేతులెత్తి జైకొట్టిన రైతాంగం

- ఉద్యమ సమయంలో తాను బుస్సాపూర్‌కు వచ్చానని, అప్పుడు ఉన్న ఉత్సాహమే మీలో ఇప్పుడూ కనబడుతున్నదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చెప్పడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.
- ఉద్యమ సమయంలో పాడిన పాటలు రేవంత్‌రెడ్డి సర్కారు పుణ్యమా అని మళ్లీ పాడాల్సి వస్తున్నదనడంతో రైతులు చప్పళ్లట్లో హోరెత్తించారు.
- ప్రభుత్వ పథకాలపై రసమయి పాడిన పాటకు 'అన్ని ఉత్తయే.. అన్ని ఉత్తయే..' అంటూ రైతులు కోరస్ ఇచ్చారు.
- ఎమ్మెల్యే వేముల మాట్లాడుతున్నప్పుడు రైతులు చేతులు లేపి మద్దతు పలికారు.
- కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుదామా అని ప్రశ్నించగా.. పిడికిలి ఎత్తి చెబుదామని నినదించారు.
- రుణమాఫీ అయ్యిందా..? అని ప్రశ్నించగా లేదంటూ చేతులు పైకి ఎత్తి కాలేదని బదులిచ్చారు.

ప్రేమ్‌చంద్ కుటుంబానికి అండగా బీఆర్ఎస్

రూ.లక్ష సాయం అందజేసిన కమిటీ

మోర్తాడ్, జనవరి 25: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నవీపేట్ మండలం నాగేపూర్ గ్రామానికి చెందిన రైతు కేతావత్ ప్రేమ్‌చంద్‌నాయక్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలబడింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ తరపున రూ.లక్ష నగదును కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. గల్ఫ్ వెళ్లి కలిసిరాక తిరిగి వచ్చి అప్పులు చేసి పంటలు పండించుకుంటున్న సమయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినట్లుగా రుణమాఫీ చేయకపోవడం అప్పుల భారం పెరగడం, బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరగడం కారణంగానే ప్రేమ్‌చంద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ముగ్గురు పిల్లలు ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో కేటీఆర్ ఆదేశాల మేరకు రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించినట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు ఎవరైనా రైతు చనిపోతే వారం రోజుల్లోనే రైతుబీమా డబ్బులు అందేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబీమా అందడంలోనూ చాలా నిర్లక్ష్యం జరుగుతున్నదన్నారు. ప్రేమ్‌చంద్ చనిపోయి 40 రోజులవుతున్నా ఇప్పటికీ రైతుబీమా రాలేదని చెబుతున్నారన్నారు. దీన్ని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు.



ప్రేమ్‌చంద్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న కమిటీ సభ్యులు, వేముల

'బాకీల బాధకు చనిపోయిండు'

మా ఇంటాయన బాకీల బాధకు పురుగుల మందు తాగి చనిపోయిండు. కూలీ పని చేసుకుంట ముగ్గురు పిల్లల్ని సాకుతున్నానని ప్రేమ్‌చంద్ భార్య కళావతి తెలిపారు. 'పెట్టుబడి సాయం రాలేదు, రుణమాఫీ కాలేదని నా భర్త నాతో చెప్పిండు, ఎక్కడెక్కడో బాకీ లు తెచ్చిన. ఇప్పుడు బాకీ పుడ్తలేదు. నీళ్లు లేక పంటలు పండుత లేవు అని బాధ పడుతుండె. నేను కూలీ పనికి పోయినంక పురుగుల మందు తాగి చనిపోయిండని' కళావతి బోరున విలపించింది. ముగ్గురు పిల్లలతో ఎలా బతకాలో అర్థమైతలేదని, ధైర్యం చాలడం లేద ఆవేదన వ్యక్తం చేసింది.

రైతు ప్రేమ్‌చంద్ కుటుంబంతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

అన్నదాత చావులు చూడ్డానికా

తెలంగాణ తెచ్చుకున్నది?

- రైతుల్లో దేవుడిని చూసిన ఏకైక వ్యక్తి కేసీఆర్
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మోర్తాడ్/బాల్కొండ/భీమ్‌గల్/వేల్పూర్/మెండోరా/ముప్కాల్, జనవరి 25: పదేండ్లు ఆనందంగా ఉన్న రైతులు ఒక్క ఏడాదిలోనే ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. రైతుల చావులు చూడడానికి కాదు తెలంగాణ తెచ్చుకున్నది. మన రైతులను మనం కాపాడుకుందామనే ఉద్దేశంతో మీ ముందుకువచ్చామన్నారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి రైతు వెన్నుముకగా నిలబడ్డాడని గుర్తుచేశారు. రైతుల్లో దేవుడిని చూసిన ఏకైక వ్యక్తి కేసీఆర్. ఉద్యమంతో తెచ్చుకున్న తెలంగాణలో పదేండ్లు మంచిగున్నమని. 75 ఏండ్ల కాలంలో 10 ఏండ్లు మినహా ఇంకెప్పుడన్న రైతులు బాగున్నారా? అని ప్రశ్నించారు. గోదావరి నీళ్లు మాగ్గావాలే అని చెప్పి ఇవాళ కాళేశ్వరం ద్వారా రైతన్నల కాళ్లు కడిగిన కేసీఆర్ సంతోషాన్ని చూడలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కన్నీళ్లతో అభిషేకాలు చేయించుకుంటుందని ధ్వజమెత్తారు. రైతులను దేవుళ్లుగా కేసీఆర్ చూస్తుంటే, కేసీఆర్‌ను రైతులు దేవుడిగా చూస్తూ ఉంటే ఇవాళ రేవంత్‌రెడ్డి కుట్రతో, కుళ్లుతో పగ బట్టిండని మండిపడ్డారు. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా ఉండలేదని హెచ్చరించారు. రైతులు ధైర్యాన్ని కోల్పోకుండా సమస్యలపై పోరాటం చేయాలని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.